క్లుప్తంగా

ముగిసిన చండీయాగం



చండీయాగంలో సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ స్వగృహంలో ఈనెల 1న ప్రారంభమైన వీరశైవ ఆగమోక్త ప్రకారం నిర్వహించిన రాజశ్యామల సహిత నవచండీ యాగం బుధవారంతో ముగిసింది. మూడు రోజులపాటు చండీ ఉపాసకులు అయ్యప్ప స్వామి, అజయ్‌స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవచనం, మండప పూజ, గణపతి హవనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సురేష్ షెట్కార్‌తోపాటు ఆయన కుటుంబీకులు, బంధువులు, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తీర్థ అన్నప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న సీడీసీ మాజీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్

రాయికోడ్(అందోల్): భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారు.. దేవతా మూర్తులకు నైవేద్యాలు సమర్పించి మొక్కులను చెల్లించారు. సీడీసీ మాజీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్.. స్వామి వారిని దర్శించుకోగా అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆలయ నిర్వాహకులు శాలువాతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు హన్మంత్‌రావు పాటిల్, ఆలయ సిబ్బంది, అర్చకులు ఈ.కృష్ణ, రుద్రయ్య స్వామి తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎంపీడీఓ సురేష్, ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎంలు, వీఓ లీడర్లకు విధులు, నిధులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసే నిధులను పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వెచ్చించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం



డీసీఎల్‌కు వేతన ఒప్పంద పత్రాలను అందజేస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులు, పరిశ్రమ నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: కార్మిక సమస్యలు పరిష్కరించడంలో ముందుంటా అని మైక్రోబ్యాక్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ అన్నారు. బుధవారం మైక్రోబ్యాక్స్ పరిశ్రమ నూతన వేతన ఒప్పందం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డీసీఎల్ (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్) సమక్షంలో జరిగింది. కార్యక్రమంలో పరిశ్రమ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శివలింగం, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఈసీ మెంబర్స్ వెంకటేశం, సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఉమాదేవి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం కానుకుంట, గుమ్మడిదల, నల్లవల్లి గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ ఉమాదేవి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

భక్తిభావం



బృంగీశ్వర వాహనంపై ఊరేగుతున్న వీరభద్రుడు

జిన్నారం మండలం.. వీరన్నగూడలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి బృంగీశ్వరవాహనంపై స్వామిని ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా ఈఓ శశిధర్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఉత్సవాలకు హాజరైన భక్తులు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - జిన్నారం(పటాన్‌చెరు)

అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని వట్‌పల్లి ఎస్‌ఐ కోటేశ్వర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని శివాజీ విగ్రహం వద్ద భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేందుకు ఇలాంటివి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. వట్‌పల్లి(అందోల్)

నిర్వహణ లోపం.. రైతుకు శాపం

- పాడైన తూము.. విడుదల కాని నీరు
- ఎండుతున్న వరి పంట
- నష్ట పరిహారం ఇప్పించాలంటున్న రైతులు



పాడైపోయిన కిసాన్ సాగర్ చెరువు తూము

కంది(సంగారెడ్డి): చెరువులు, కుంటల నిర్వహణ సక్రమంగా లేకపోవడం రైతులకు శాపంగా మారింది. ఎన్నో ఏళ్ల నుంచి అలుగులు, తూములు, పంట కాలువలకు మరమ్మతులు చేపట్టక పోవడంతో ఆయకట్టు కింద పంటల సాగు కష్టతరంగా మారింది. పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు పెరిగిన కాల్వలను పూడ్చి రియల్టర్లు కబ్జా చేస్తున్నారు. దీంతో చెరువులు, కుంటల కింద ఉన్న ఆయకట్టుకు నీరందక పంట పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. పంటలు సాగు చేసినా నీరులేక పంటలు ఎండి పోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కంది మండలంలో ఇరిగేషన్ అధికారుల రికార్డు ప్రకారం 90 చెరువులుండగా, ఆయకట్టు సుమారు 9 వేల ఎకరాల వరకు ఉంది. ప్రస్తుతం 1500 ఎకరాల వరకు మాత్రమే ఉండ వచ్చని రైతులు చెబుతున్నారు. కందిలోని కిసాన్ సాగర్ చెరువు కింద సుమారు 200 ఎకరాలు సాగు ఉండగా ప్రస్తుతం అందులో అధిక భాగం వెంచర్లు, కమర్షియల్ బిల్డింగులు ఏర్పాటు చేశారు. ఇదే క్రమంలో పక్కనే ఉన్న పంట కాల్వలను ఆక్రమణకు గురయ్యాయి. కాలువలు మాయం కావడంతో పంటలకు సాగు నీరు అందలేని దుస్థితి నెలకొంది. ఆయకట్టు నీటిని నమ్ముకుని కంది ప్రాంత రైతులు వరి సాగు చేశారు. కొన్ని రోజులు పంటకు నీరు అందడంతో విత్తన దశకు చేరుకుంది. ప్రస్తుతం చెరువు తూము చెడిపోవడంతో నీరు రావడం లేదు. దీంతో చేతికి వచ్చిన పంట ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదల విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి తూముతో పాటు పంటకాల్వలకు మరమ్మతులు చేపట్టి పంటలకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



కిసాన్ సాగర్ చెరువు కింద ఎండిపోయిన వరి పంట

పంట నష్టపరిహారం ఇప్పించాలి



కిసాన్ సాగర్ చెరువు కింద 6 ఎకరాల్లో వేసిన వరి పంట నీరందక పూర్తిగా ఎండిపోయింది. విత్తు దశలో ఉన్నవరి చేతికి అందకుండా పోయింది. అధికారులు స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. -బండి వీరారెడ్డి, రైతు

మరమ్మతులు చేయిస్తాం

తూము చెడిపోయిన మాట వాస్తవమే. చాలాకాలంగా వాడుకలో లేకపోడంతో తూము పనిచేయడం లేదు. దీంతో ఆయకట్టుకు నీటి సరఫరా అందడం లేదు. త్వరలోనే మరమ్మతులు చేపడతాం. -మజహరొద్దీన్, ఏఈ ఇరిగేషన్

కాంగ్రెస్‌లోకి ఎంపీపీ అంజమ్మ



మంత్రి రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న అంజమ్మ

న్యాల్‌కల్(జహీరాబాద్): బీఆర్‌ఎస్‌కు చెందిన న్యాల్‌కల్ ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ హైదరాబాద్‌లోని మంత్రి దామోదర రాజనర్సింహ నివాసంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌కు చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని రాజనర్సింహ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ ఎంపీ స్థానాలను పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరనున్నారని అంజమ్మ పేర్కొన్నారు. ఇటీవల బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీపీ ఉపాధ్యక్షుడు గౌసొద్దీన్, అతని సోదరుడు బీఆర్‌ఎస్ నాయకులు రఫీయొద్దీన్ ఆ పార్టీలో చేరడం తెలిసిందే. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, కాంగ్రెస్ న్యాల్‌కల్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, డాక్టర్ అశోక్, రంజిత్, బలరామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సునీల్, వడ్డి రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ధ్వంసం చేసిన వారిపై కేసు



ధ్వంసం చేసిన ఫెన్సింగ్

జహీరాబాద్ టౌన్: మండలంలోని గోవింద్‌పూర్ గ్రామ పరిధిలోని వ్యవసాయ భూమిలో ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ. నరేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. గోవింద్‌పూర్ గ్రామ పరిధిలోని 112 సర్వే నంబర్ గల 219 ఎకరాల భూమిని పీపుల్ ప్రొగ్రెసివ్ ట్రస్టు నిర్వాహకులు 2019లో కొన్నారు. భూమి పొజిషన్ కోసం ఆర్డీఓకు దరఖాస్తు చేశారు. సర్వేయర్ చుట్టు పక్కల వారికి నోటీసులు జారీ చేసి హద్దులు చూపించి పంచనామా పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ట్రస్టు నిర్వాహకులు పొలం చుట్టూ రాళ్లతో ఫెన్సింగ్ వేశారు. అందులో తమకు చెందిన 16 ఎకరాల పొలం ఉందని జహీరాబాద్‌కు చెందిన కమల్ కిషోర్ అతని అనుచరులు రవి పల్లోడ్, ప్రేమ్‌సింగ్, పూల్‌సింగ్‌లు బుధవారం జేసీబీ సహాయంతో 240 రాళ్లను ధ్వంసం చేయగా రూ.5 లక్షల నష్టం జరిగింది. ట్రస్టు సభ్యులు శివారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

మనూరు: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలో ఉన్న దోసపల్లి.. మైసమ్మ ఆలయం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. ఆయన వెంట బెల్లాపూర్ మాజీ సర్పంచ్ డిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందారెడ్డి, దుదగొండరాజు, గుండేరావు, నాయకులు సిద్ధారెడ్డి, దత్తు, శ్రీకాంత్‌రెడ్డి, గాళెప్ప, సత్యనారాయణ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహించాలి

సంగారెడ్డి అర్బన్: మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహించాలని కేవీపీఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి.అశోక్ అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంగారెడ్డి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుల విగ్రహాలకు సామాజిక ఉద్యమ నాయకుల విగ్రహాలకు కూడా ముసుగులు వేస్తున్నారన్నారు

నర్సరీల బాధ్యత కార్యదర్శులదే

కంగ్టి(నారాయణఖేడ్): తెలంగాణ వన నర్సరీలు పెంచే బాధ్యత పంచాయతీ సెక్రటరీలదే అని ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. మండలంలోని గాజుల్‌పాడ్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న నర్సరీని బుధవారం పరిశీలించారు. దాదాపు 6 వేల బ్యాగుల్లో మట్టి నింపి విత్తనాలు వేసినట్లు సెక్రటరీ రాజ్ కుమార్ తెలిపారు. గ్రామాల్లో, తండాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సెక్రటరీని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



హత్నూర: దౌల్తాబాద్ వద్ద కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

సాక్షి, నెట్‌వర్క్ : దొడ్డి కొమురయ్య జయంతిని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం, సదాశివపేట రూరల్.. వెంకటాపూర్‌లో, హత్నూర.. దౌల్తాబాద్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం నేతలు, యువకులు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా రహదారులు



నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

మండుతున్న ఎండలు

ఝరాసంగం(జహీరాబాద్): రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. రెండు రోజులుగా ఎండలు మరీ ఎక్కువయ్యాయి. మంగళ, బుధవారాలు 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రత చేరుకుంది. దీంతో మధ్యాహ్నం సమయంలో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. కనుచూపు మేర జనసంచారం కనిపించలేదు. ఏప్రిల్ ప్రారంభంలోనే ఈ విధంగా ఎండలు ఉంటే, మే నెలలో ఏ విధంగా ఉంటాయో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఓటు నమోదు చేసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకోవాలని గుమ్మడిదల ఎంపీడీఓ ఉమాదేవి సూచించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవటంతో పాటు నూతన ఓటు నమోదుకు తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్‌లకు బుధవారం గుమ్మడిదలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటర్ నమోదు కార్యక్రమంపై మున్సిపాలిటీ పరిధిలోని కాలనీవాసులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎవరైనా ఓటరుగా నమోదు చేసుకొని పక్షంలో వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

◆ దుస్తుల పంపిణీ



జహీరాబాద్ టౌన్: అన్నదాన సేవా సమితి ట్రస్టు నిర్వాహకులు బుధవారం నిరుపేదలకు దుస్తులను పంపిణీ చేశారు. పట్టణంలోని పాత బస్తీకి చెందిన సుమారు వంద మందికి వాటిని పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలచందర్ మాట్లాడుతూ పేదల ఆకలితీర్చడానికి కొన్ని సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రోజూ పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అన్నదాన సేవా సమితి ట్రస్టు సభ్యులు బెజుగం రాజయ్య, కె.బాలచందర్, వెంకటేశం, పాండయ్య, సంగ్రాం, బరూర్ దత్తాత్రి ముదిరాజ్, శివరాజ్, శివ, వినయ్, సంతోష్, రాజు దాతలు ఉప్పరి దత్తాత్రి, పాండుకుమార్, రవి పాల్గొన్నారు.

◆ నీటి వ్యాపారాన్ని అరికట్టండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న నీటి వ్యాపారాన్ని అరికట్టాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ గారి రమణ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలుచోట్ల నీటి వ్యాపారం జరుగుతోందన్నారు. అక్రమంగా ట్యాంకుల ద్వారా నీటిని తరలిస్తున్నారని తెలిపారు. దీనిని పూర్తిస్థాయిలో అధికారులు నియంత్రించి ప్రజలకు సరిపడా నీటి సరఫరా చేయాలని కోరారు.

◆ కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గుంజోటిలో మానసా దేవి నాగదేవతా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన గురువారం.. గోపూజ, మండప ఆరాధన, మూల మంత్రం, జపం, హవనం, దేవతా మూర్తులకు గో ద్రవ్య అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

◆ గుమాస్తా వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ గుమాస్తా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని సుభాష్ గంజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బి.శేఖర్, అధ్యక్షుడిగా ఆర్.రవికుమార్, ఉపాధ్యక్షుడిగా కె.మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా గులాం మహమ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్. శరణప్ప, సహాయ కార్యదర్శిగా ఎ.కృష్ణ, కోశాధికారిగా ఎం.జగదీశ్వర్, సలహాదారులుగా హెచ్.రాజ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

◆ కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గ సమన్వయకర్తగా నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పటాన్‌చెరుకు చెందిన నర్సింహారెడ్డిని లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జహీరాబాద్ నియోజకవర్గ సమన్వయకర్తగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

◆ ముంపు బాధితులను ఆదుకోవాలి

సంగారెడ్డి టౌన్: అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితులను ఆదుకోవాలని ముంపు బాధితుల జేఏసీ చైర్మన్ సత్యనారాయణ కోరారు. బుధవారం జిల్లా కేంద్రమైన పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వల్లూరి క్రాంతికి వినతి పత్రం అందించారు. 5 వేల ప్లాట్లు ముంపు చెరువులో చిక్కుకొని ఉన్నాయని పేర్కొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర మాజీ సర్పంచ్ ఆకుల కిష్టయ్య తన అనుచరులతో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం హస్తం పార్టీలో చేరారు. ఆయనతోపాటు మాజీ వార్డు సభ్యులు సుమారు 50 మంది బీఆర్‌ఎస్ నుంచి చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నాయకురాలు సువాసినీ రెడ్డి, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్ట్ తనిఖీ



దెగుల్‌వాడి చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న డీసీఎస్‌ఓ

కంగ్టి(నారాయణఖేడ్): లోకసభ ఎన్నికల దృష్ట్యా మండల పరిధిలోని దెగుల్‌వాడి సమీపంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాతారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నందునా ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఇక్కడ మద్దతు ధర ఎక్కువగా ఉండడంతో ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ. వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400